ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
మంగళవారం 16 ఏప్రిల్ 2024

చిట్టీల పేరిట చీటింగ్..

కొందరు నెలవారీ చిట్టీల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారు. రూ.లక్ష చిట్టీని 25మంది నెలకు రూ.4వేల చొప్పున 25నెలలు చెల్లించాలి. ఇందులో డ్రా తీసి ఎవరికి వస్తే వారికి కొందరు చెల్లిస్తుండగా, ఎవరు ఎక్కువ పాట పాడితే వారికి ఇస్తున్నారు. డబ్బులు అత్యవసరం ఉన్నవారు రూ.లక్షకు రూ.25వేల వరకు కూడా పాడి డబ్బులు తీసుకుంటున్నారు. దీంతో 25శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. పైగా చిట్టీ నిర్వాహకులు కూడా ప్రతీ వ్యక్తి నుంచి 5శాతం కమీషన్‌గా తీసుకుంటున్నారు. అయితే ఈ చిట్టీల వ్యాపారుల్లో కొందరు.. తమకు చిట్టీల డబ్బులు చెల్లించిన వారికి ఇవ్వకుండా ఉడాయించిన సంఘటనలున్నాయి. అలాగే మండల కేంద్రాల్లో లక్కీ డ్రాల పేరుతో ద్విచక్ర వాహనాలను ఆశ చూపుతు లక్షల్లో వసూళు చేసి దుకాణం మూసేస్తున్నారు.

వరంగల్‌లోని ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కార్పొరేటర్ ప్రజల నుంచి నెలవారీ చిట్టీల పేరుతో సుమారు రూ.2కోట్ల వరకు డబ్బులు వసూ లు చేశాడు. చివరకు వసూలు చేసిన డబ్బులను తనకు చిట్టీలు కట్టిన వారికి ఇవ్వ కుండా.. తనకే నష్టం వచ్చిందని బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితులు ఇంతేజార్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తీసుకున్న అప్పు చెల్లించలేదంటూ హనుమకొండకు చెందిన ఓ వ్యక్తిని... తమకు ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని వడ్డీ వ్యాపారి ఒత్తిడి చేస్తున్నాడు. దీంతో ఆ బాధితుడు లబోదిబోమంటున్నాడు.

వరంగల్ రంగశాయపేటలో అధిక వడ్డీ బాధితుడు ఒకరు సొంత ఇంటిని, ఇంటి స్థలాన్ని కోల్పోయాడు. రూ.1లక్ష అప్పు తీసుకుంటే.. నాలుగేళ్లలో సొంతింటిని కోల్పోయే స్థాయిలో అతడి అప్పులు పెరిగిపోయాయి. దీంతో బాధితుడి కుటుంబం వీధిన పడింది.

శివనగర్‌లో ఓ యువకుడు వడ్డీ వ్యాపారి నుంచి రూ.1.30లక్షల అప్పు తీసుకున్నారు. దీనికి రూ.10 చొప్పున వడ్డీ చెల్లిస్తున్నాడు. ఏడాది కాలంలోనే రూ.1.38లక్షల అప్పునకు రూ.1.28లక్షల వడ్డీ చెల్లించాడు. అయితే అరోగ్యం బాగా లేకపోవటంతో అసలు డబ్బు మాత్రం చెల్లించక పోవడంతో వడ్డీ వ్యాపారి వేధిం చడం మొదలు పెట్టడంతో బాధితుడు మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వడ్డీ మాఫియా!





- జనం అవసరాలే ఆసరాగా కొందరి అధిక వడ్డీ దందా
- రూ.100కు రూ.10 చొప్పున వడ్డీ వసూలు
- మైక్రో ఫైనాన్స్, నెలవారీ చిట్టీల పేరిట జనం సొమ్ము దోపిడీ
- అక్రమంగానే వ్యవహారమంతా..
- చోటామోటానేతలు, కొందరు కార్పొరేటర్లు, వారి అనుచరులే సూత్రధారులు
- రూరల్ ప్రాంతాల్లో వడ్డీపై పోలీసుల ఉక్కుపాదం
- నగరంలో మాత్రం ఖాకీలది ప్రేక్షక పాత్రే!

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి- వరంగల్)

రూ.100కు రూ.10, రూ.వెయ్యికి రూ.100, రూ.లక్షకు రూ.పది వేలు.. ఇదీ వడ్డీ వ్యాపారుల లెక్క. జనాల అవసరాలను ఆసరాగా చేసుకుని జలగల్లా పట్టి పీడిస్తున్న వడ్డీ మాఫియా కథ. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ.. ఆస్తులు, బంగారం తాకట్టు పెట్టుకుం టున్నారు. ఆ అప్పు చెల్లించకుంటే తాకట్టు పెట్టుకున్న ఆస్తిని జప్తు చేసుకుంటున్న సంఘటనలున్నాయి. దీంతో ఆధిక వడ్డీలు చెల్లించలేక మానసిక, ఆర్థిక ఒత్తిడితో అనేక కుటుంబాలు రోడ్డున పడు తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో పోలీసుల అండ దండలతోనే ప్రైవేట్, డైలీ ఫైనాన్స్ మాఫియా రెచ్చిపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అవసరాలే ఆసరాగా...

డబ్బు అత్యవసరం ఉన్న ప్రజలే లక్ష్యంగా కొందరు వడ్డీ వ్యాపారులు తమ దందా సాగిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని జిల్లా కేంద్రాలతో పాటు మునిసి పాలిటీల్లో గిరిగిరి దందా జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ వ్యవహారంతో అనేక మంది జీవితాలు వీధిన పడుతున్నాయి. ముఖ్యంగా చిరు వ్యాపారులు, కూరగాయలు, పండ్లు విక్రయించే వీధి వ్యాపారులు, ఆటో నడుపుకొనే వారు, కూలీలు లక్ష్యంగా వడ్డీ వ్యాపారం జరుగుతోంది. డబ్బులు అత్యవసరం ఉన్నవారి నుంచి రూ.100కు రూ.10వడ్డీ వసూలు చేస్తున్నారు. రూ.10వేల అప్పు తీసుకున్న వారికి రూ.వెయ్యి కోత పెట్టి రూ.9వేలు ఇస్తున్నారు. వారానికి రూ.వెయ్యి చొప్పున పదివారాల్లో వసులు చేస్తున్నారు. ఇంకొన్ని చోట్ల ఉదయం రూ.900 ఇచ్చి సాయంత్రం రూ.వెయ్యి తీసుకుంటున్నారు. 12గంటల తిరగక ముందే ఒక వెయ్యి రుపా యలకు రూ.100 వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇలా ఒక రోజు లక్ష రుపాయలు వడ్డీకి ఇస్తే ఒక రోజులోనే రూ.10 వేల వడ్డీ లాగేస్తున్నారు. నెలకు రూ.వెయ్యికి రూ.వంద వడ్డీ చొప్పున వసూలు చేస్తున్నారు. అప్పు ఇచ్చే సమయంలో ఖాళీ చెక్కులు, పట్టాదారు పాసు పుస్తకాలు, బంగారు నగలు, స్థిరాస్తి హక్కు పత్రాలు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు ఇతర వాహనాలను తాకట్టు పెట్టుకుంటున్నారు. ఒక వేళ ఏదైనా కారణాలతో అప్పు చెల్లించకపోతే తాకట్టు పెట్టుకున్న ఆస్తిని లాక్కుంటున్నారు. ఖాళీ చెక్కులతో కోర్టుల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో చాలామంది మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. సమాజంలో పరువు పోతుందని కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న సంఘటనలు ఉన్నాయి.

దందాలో రాజకీయ నేతలు, టీచర్లు, పోలీసులు

గిరిగిరి దందాలో కొందరు రాజకీయ నేతలతో పాటు చాలా ప్రాంతాల్లో కొందరు టీచర్లు కూడా ఉన్నారు. ప్రధానంగా వరంగల్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతుంది. కొన్ని ఏరియాల్లో పోలీసుల అండదండలతోనే అధిక వడ్డీ వ్యాపారం సాగుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. వరంగల్ తూర్పు ప్రాంతంలో ముగ్గురు కార్పొరేటర్లు, మరో నలుగురు మాజీ కార్పొరేటర్లు వడ్డీ వ్యాపారం రూ.లక్షల్లో సాగిస్తున్నారు. అధికార పార్టీ అండదండలు కొందరికి ఉండగా, మరికొందరికి ఖాకీల సాన్నిహి త్యం ఉన్నట్టు సమాచారం. దీంతో శివనగర్, రంగాశాయిపేట, బట్టల బజారు, ఉర్సు, రైల్వేగేటు, మిల్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో గిరిగిరితో పాటు రూ.లక్షల్లో వడ్డీ వ్యాపారం సాగిస్తున్నారు. అధికార బలంతో పాటు ఖాకీల సహకారం ఉండటంతో ఫైనాన్స్ దందాను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. వరంగల్ పశ్చిమ

మిగతా 7వ పేజీలో..



కమిషనరేట్ పరిధిలో మౌనమేల?

అధిక వడ్డీ వ్యాపారులపై రాష్ట్ర వ్యాప్తంగా దాడులు జరుగుతుంటే.. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు మౌన ముద్రలో ఉండ టంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూ పాలపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 8వ తేదీన ఫైనాన్స్ వ్యాపారి వేధింపులు భరించలేక గణేష్ చౌరస్తాలో నివాసం ఉంటున్న బయ్యావుల ఏడు కొండలు అనే చిరు వ్యాపారి ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసుశాఖ రాష్ట్రవ్యాప్తంగా వడ్డీ వ్యాపారులపై నిఘా పెట్టి తనిఖీలు చేపడుతుంది. ములుగు పోలీసులు ఏటూరునాగరంలోని ఓ మహిళ వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు చేసి, విలువైన దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి, మహదేవపూర్‌లోని వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు చేశారు. అయితే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాత్రం వడ్డీ వ్యాపారులపై పోలీసుల దాడులు లేకపోవడం వెనుక మతలబు ఏంటన్న చర్చ జరుగుతోంది. ఇక్కడి వడ్డీ వ్యాపారుల్లో అనేక మంది రాజకీయ నేతలు, వారి అనుచరులు ఉండటంతోనే వారిని టచ్ చేసేందుకు ఖాకీలు సాహసం చేయడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్లాది రుపాయలను అధిక వడ్డీలకు తిప్పుతు న్నారనే సమాచారం ఉన్నా పోలీసులు పట్టించు కోకపోవడం చర్చనీయాంశంగా మారింది. 2022 జూలై 28న వడ్డీ వ్యాపారుల వేధింపులు తట్టు కోలేక ఓ మహిళ మట్టేవాడ మహిళ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. పోలీసులు వడ్డీ వ్యాపా రికి వత్తాసు పలకటంతో పోలీస్‌స్టేషన్‌లోనే పురు గుల మందు తాగిన సంఘటన ఖాకీల పరువు ను బజారున పడేసింది. అయినప్పటికీ పోలీసుల తీరులో మాత్రం మార్పు రాలేదన్న చర్చ జరుగుతోంది.

సోమవారం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0°C | కనిష్ఠం : 24.5°C

ఎన్నికల విధులను నిబద్ధతతో నిర్వర్తించాలి: కలెక్టర్



వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 15: ఎన్నికల్లో నోడల్ అధికారులు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి జిల్లా నోడల్ అధికారులతో ఎన్నికల నియమావళి తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన ప్రతి అంశంపై నోడల్ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 25 వరకు వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణ దృష్ట్యా అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా నోడల్ అధికారులు సంబంధిత అంశాలపై ప్రతి రోజు నిర్ణీత నమూనాలో నివేదికలు సమర్పించాలని తెలిపారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీవో కౌసల్యదేవి, డీపీవో కల్పన, జడ్పీ సీఈవో రామిరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, డీబీసీడీవో పుష్పలత, డీ ఎస్‌డీవో సౌజన్య, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ పాల్గొన్నారు.

ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐల బదిలీ

వరంగల్ క్రైం, మార్చి 15: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా బదిలీ అయిన సీఐలలో ఎన్.కరుణాకర్ టాస్క్‌ఫోర్స్ నుంచి మహిళా పోలీస్ స్టేషన్ (సుబేదారి), ఎన్.వెంకట్రామ్ మహిళా పోలీస్ స్టేషన్ నుంచి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఎస్‌ఐలలో బి.రామారావు హనుమకొండ నుంచి నల్లబెల్లి, ఎన్.నగేష్ నల్లబెల్లి నుంచి వీఆర్ బదిలీ అయ్యారు.

నామినేషన్‌పై అభ్యర్థులకు అవగాహన అవసరం

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బల్దియాలో వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం



వివిధ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 15: లోక్‌సభ ఎన్నికల వేళ పార్టీ ప్రతినిధులకు నామినేషన్ల సమర్పణపై అవగాహన అవసరం అని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో 106-వరంగల్ తూర్పు నియోజక వర్గం ప్రజాప్రతినిధులకు నామినేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నామినేషన్ వేసే క్రమంలో అభ్యర్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 18న ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమై 25న ముగుస్తుందని అన్నారు. నామినేషన్‌లు వేసే తేదీలలో ఉదయం 11గంటల నుంచి 3గంటలలోపు పత్రాలను అందించాలని చెప్పారు. ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో నామినేషన్ పత్రాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారని అన్నారు. రిజర్వు స్థానాలలో పోటీ చేసే అభ్యర్థులు మండల తహసీల్దార్లతో జారీ చేయబడిన కుల ధ్రువీకరణ పత్రం, నామినేషన్ పత్రంతో పాటు రూ.12,500 చెల్లించాలని అన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎస్సీ అభ్యర్థులు మరో చోట పోటీ చేయాలనుకుంటే కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ఓటరు జాబితాలో పేరు కలిగి ఉండాలన్నారు. అంతే కాకుండా రిటర్నింగ్ అధికారితో ఓటరు ఓటరు సర్టిఫికేషన్ పత్రం పొంది ఉండాలన్నారు. నామినేషన్ చివరి రోజు ఈ నెల 25న మధ్యాహ్నం 3గంటల తర్వాత ఎలాంటి నామినేషన్లు స్వీకరించబడవని అన్నారు. నామినేషన్ వేసే వారితో ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారని, ఇందుకు సిబ్బందికి సహకరిం చాలని అన్నారు. ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని అన్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు నిబంధనలు పాటించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, వివిధ పార్టీల ప్రతినిధులు జన్ను అనీల్, రవి, హరిశంకర్, దాసరి రాజేశ్‌లు ఉన్నారు.

భద్రకాళికి లక్ష లిల్లీపూలతో అర్చన



వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 15: వరంగల్‌లోని ప్రసిద్ధిగాంచిన భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో కొనసాగుతున్న వసంత నవరాత్రోత్సవాలు సోమవారంనకు ఏడోరోజుకు చేరారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం, నవరాత్రోత్సవాల్లో భాగంగా జపం, హోమం, అర్చన, అభిషేకాలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని లక్ష లిల్లీ పూలతో పుష్పార్చన చేశారు. సోమవారం ఆది దేవత చంద్రుడు. అమ్మవారికి ఆరాధనగా ఉత్సవం నిర్వహించారు. పూజా సేవకర్త తోట జగన్నాథం సౌజన్యంతో పుష్పార్చన నిర్వహించారు. ఆ సమయంలో అమ్మవారిని వందలాది మంది మహిళ భక్తు లు సామూహికంగా శ్రీలలితా సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం కుంకుమ ప్రసాద వితరణ జరిగింది. రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఆలయంలో ఉత్సవాల ఏర్పాట్లను ఈవో శేష భారతి పర్యవేక్షించారు.



సీపీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న టీఎస్‌ఎంసీ సభ్యులు

సీపీని కలిసిన టీఎస్ఎంసీ సభ్యులు

కరీమాబాద్, ఏప్రిల్ 15: తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ (టీఎస్‌ఎంసీ), వైద్య టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు సోమవారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను కలిశారు. వైద్య టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు డాక్టర్ మాగంటి శేషుమాధవ్, డాక్టర్ వేములపల్లి నరేష్, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి సీపీని కలిశారు. ఈ సందర్భంగా నకిలీ వైద్యులు, నకిలీ వైద్య సంస్థలపై జరిపే తనిఖీలకు సహకరించాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. సీపీ స్పందిస్తూ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా సరైన వైద్య పత్రాలు లేకున్నా, నిబంధనలు అతిక్రమించి వైద్యం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైన టీఎస్‌ఎంసీ తెలంగాణ వైద్య మండలిలో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీసుల తనిఖీల్లో రూ. 5.44లక్షల పట్టివేత

- వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్

మట్టెవాడ/వరంగల్‌చౌరస్తా, ఏప్రిల్ 15: వరంగల్‌లో పలు ప్రాంతాల్లో భారీగా నగదు పట్టుబడినట్టు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ సోమవారం తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వరంగల్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో సోమవారం వరం గల్ నగరంలోని జేపీఎన్ రోడ్డు, పోచమ్మ మైదాన్, నర్సంపేట రోడ్డు, తదితర ప్రాంతాల్లో విస్తృ తంగా తనిఖీలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.5,44,800 స్వాధీన పర్చుకున్నట్లు ఏసీపీ తెలిపారు. దేశాయిపేటకు చెందిన కూనాటి రాజేష్ వద్ద రూ.3.37 లక్షలు, వరంగల్ బ్యాంకు కాలనీకి చెందిన బచ్చు చంద్రకాంత్ వద్ద రూ.98వేలు, ములుగు జిల్లా ములుగు మండలం గోవిందరావుపేటకు చెందిన ఆకుల యుగంధర్ వద్ద రూ.లక్ష9వేల900, కలిపి మొత్తం రూ.5,44,800నగదు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అలాగే బీజేపీకి కారులో పార్టీకి చెందిన కరపత్రాలు తరలిస్తుండగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కారును కూడా స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. నగదును ఎలక్షన్ ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్టు వెల్లడించారు. వాహన తనిఖీలో మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, ఎస్సైలు విఠల్, నవీన్, గోవర్ధన్, మునీర్‌లుల్లా, మహ్మద్ చాంద్‌పాషా, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్ కాలనీ పోలీసులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో రూ.4.66 లక్షలు

వరంగల్ సిటీ: నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల బాలాజీనగర్ జంక్షన్‌లో సోమవారం పోలీసులు రూ.4.66 లక్షల నగదును పట్టుకున్నారు. ఏనుమాముల ఎస్‌హెచ్‌వో పులి రమేష్ ఆధ్వర్యంలో ఎఫ్ఎస్‌టి టీమ్‌తో కలిసి వాహ నాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ.4.66 లక్షల నగదు దొరికింది. ఎస్‌హెచ్‌వో రమేష్ మా ట్లాడుతూ.. ఇది నల్ల సాయిరెడ్డి, సంతోష్‌నగర్, హంటర్‌రోడ్, హనుమకొండ వాసిదిగా తెలుస్తుందని, డబ్బును స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తు న్నట్లు తెలిపారు.



వెంకట్రామ జంక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కేజీబీవీ విద్యార్థినులకు ఎప్‌సెట్ కోచింగ్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 154 మంది విద్యార్థులకు షార్ట్ టర్మ్ కోచింగ్
- ర్యాంకులే లక్ష్యంగా హసన్‌పర్తి కేజీబీవీలో నెల పాటు సాగనున్న ఉచిత శిక్షణ

7



కొమ్మాల హుండీ ఆదాయం రూ.54.24లక్షలు

గీసుగొండ, ఏప్రిల్ 15: కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహ స్వామి జాతర ఆదాయం రూ.54,24,862 వచ్చినట్లు అలయ ఈవో శేషగిరి తెలిపారు. సోమవారం 2వ సారి హుండీల ఆదాయాన్ని లెక్కించగా రూ.19,10,703 వచ్చినట్లు చెప్పారు. కాగా జాతర ఆదాయ మొత్తం వివరాల ఈవో వివరించారు. కేశఖండన ద్వారా రూ.1,52,200, అష్టోత్తరాలతో ద్వారా రూ.74,300, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.8,90,750, శీఘ్రదర్శనం ద్వారా రూ.4,22,400, హుండీల ద్వారా రూ.26,35,096, వివిధ వేలం పాటల ద్వారా రూ. 7,50,116, లడ్డుప్రసాదాల ద్వారా రూ.5లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో వివరించారు. గత సంవత్సరం జాతర ఆదాయం రూ.47,80,651 వచ్చినట్లు చెప్పారు. గత సంవత్సరం కంటే రూ.6,44,651 ఎక్కువ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, కాండూరి రామాచార్యులు, విష్ణు, ఫణీందర్, కనకయ్య, ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంపీటీసీ గోపాల్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, నాయకులు సాయిలి ప్రభాకర్, రాజు పాల్గొన్నారు.



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బాలసముద్రం, ఏప్రిల్ 15: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని దళిత, గిరిజన టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల కొమురయ్య ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టి వారి సమస్యలను పరిష్కరించాలని పెండ్యాల కొమురయ్య డిమాండ్ చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంద నరేశ్

వరంగల్ లోక్‌సభ బరిలో ఉంటా..

ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 15: వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ చెప్పారు. సోమవారం కేయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద నరేశ్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో విద్యార్థి ఉద్యమకారులకు ఏ రాజకీయపార్టీ టికెట్లు కేటాయించకపోవడాన్ని ఖండించారు. తాను విద్యార్థి సమస్యలపై పోరాటం చేసినట్లు తెలిపారు. పోరాటాలు చేసిన క్రమంలో కేసులపాలైనట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడినట్లు వివరించారు. పార్టీలు మారిన రాజకీయ నాయకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాను ఎంపీగా గెలిస్తే నీతి, నిజాయితీగా పనిచేస్తానని, అందరూ తనను ఆశీర్వదించి గెలిపించాలని అన్నారు. ఈ సమావేశంలో కేయూ విద్యార్థి నాయకులు అరిస్టాటిల్, వివేకనంద, సిద్ధు, నవీన్, కిరణ్, సాయి, వెంకటేశ్, సందీప్, కల్యాణ్, సురేశ్, రాజు, రమేశ్, నరేందర్, సూర్య, దిలీప్, శివ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఇద్దరు మృతి

కాజీపేట, ఏప్రిల్ 15: ఉప్పల్ రైల్వేస్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు ప్రయాణికులు మృతిచెందారు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ ఆగ్రాకు చెందిన అరుణ్ (21) ఆగ్రా నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా సోమవారం ఉప్పల్ రైల్వేస్టేషన్ వద్ద రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. కాగా, సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన ఫిరోజ్ (25) సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు సోమవారం కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తుండగా హసన్‌పర్తి రైల్వే స్టేషన్ ఫిరోజ్ రైలు నుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో అతడి రెండు కాళ్లు తెగిపడ్డాయి. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు అపస్మారక స్థితిలో ఉన్న ఫెరోజ్‌ను ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుల వద్ద ఆధారాల మేరకు వారి కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

కడియం కావ్యకు సంపూర్ణ మద్దతు

కాజీపేట, ఏప్రిల్ 15: కాంగ్రెస్ లోక్‌సభ వరంగల్ అభ్యర్థి కడియం కావ్యకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని మాదిగ హక్కుల దండోరా, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు జన్ను కనుకరాజ్, ఈటక రాజు మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా కాజీపేట సోమవారం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ఎస్సీలకు వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బీజేపీకి మద్దతు ప్రకటిస్తున్న మంద కృష్ణ మాదిగను మాదిగలు వ్యతిరేకించాలన్నారు. మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిన బీజేపీ అభ్యర్థులను మాదిగలంతా ఐక్యంగా వుండి లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఈ మీడియా సమావేశంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. పద్మయ్య జిల్లా అధ్యక్షులు వేముల బలరాములు, నాయకులు కోరిపల్లి శ్రీనివాస్, వీరయ్యసి. బాలరాజ్, కొట్టె శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి 5కే రన్ వాయిదా

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 15: ఓటరు చైతన్యంపై నేడు ఉదయం 6గంటలకు నిర్వహించే 5 కేరన్‌న అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ 5కే రన్ ఎప్పుడు నిర్ణయించేది త్వరలో చెబుతామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హత్యానేరం కేసులో ఒకరికి జీవిత ఖైదు, జరిమానా

వరంగల్ లీగల్, ఏప్రిల్ 15: పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఒకరిని అతిదారుణంగా హత్యచేసిన వ్యక్తిపై నేరం రుజువైనందున యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి ఎం.కృష్ణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపేట గ్రామానికి చెందిన అలువుల సమ్మయ్యకు అదే గ్రామానికి చెందిన దడబోయిన శంకరయ్యకు చిన్నచిన్న తగాదాలు ఉండేవి. రెండేళ్ల కిందట అలువుల సమ్మయ్య.. శంకరయ్యపై దాడి చేయడంతో మడికొండ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. పాతకక్షలు మనసులో పెట్టుకొని 2021జూలై 10న ఎప్పటిలాగా అలువుల సమ్మయ్య ఉదయం సమయంలో మనవడితో కలిసి యోగా, వాకింగ్ చేయడానికి వెళ్లాడు. ఇది గమనించిన శంకరయ్య యోగా చేస్తున్న సమ్మయ్యపై గొడ్డలితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈవిషయాన్ని అదేగ్రామానికి చెందిన కట్ట వీరారెడ్డి.. సమ్మయ్య భార్యకు తెలపడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుంది. అనంతరం తన భర్త అలువుల సమ్మయ్యపై దాడి చేసి కిరాతకంగా చంపిన దడబోయిన శంకరయ్యపై మడికొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడు శంకరయ్యపై హత్యానేరం కేసు నమోదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయ మూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ వి.రాజేష్ సాక్షులను ప్రవేశపెట్టగా మంతెన రవికుమార్, డి.ప్రతాప్ దర్యాప్తు అధికారులుగా వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సత్యనారాయణ కేసు వాదించారు.

కేజీబీవీ విద్యార్థినులకు ఎప్‌సెట్ కోచింగ్

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 154 మంది విద్యార్థులకు షార్ట్ టర్మ్ కోచింగ్

ర్యాంకులే లక్ష్యంగా హసన్‌పర్తి కేజీబీవీలో నెల పాటు సాగనున్న ఉచిత శిక్షణ


హసన్‌పర్తి కేజీబీవీ ఎప్‌సెట్ కోచింగ్ సెంటర్‌లో తరగతులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న విద్యార్థినులకు ఇకనుంచి ఎప్‌సెట్ (ఇంజనీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ)లో ర్యాంకుల పంట పండనుంది. ఇందుకోసం ఈ ఏడాది నుంచి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కేజీబీవీల్లో ఎప్‌సెట్ షార్ట్ టర్మ్ కోచింగ్‌ను నెల పాటు ప్రభుత్వం అందిస్తుంది. దీంతో ర్యాంకుల సాధనలో ప్రైవేటు, ప్రతిభ గురుకుల జూనియర్ కళాశాలల సరసన కేజీబీవీలు చేరనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా కేజీబీవీల్లో ఈ విద్యా సంవత్సరం ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షలు రాసిన 154 మంది విద్యార్థులను ఎంపిక చేసి హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి కేజీబీవీలో నెల పాటు ఉచితంగా వసతులతో కూడిన ఎప్‌సెట్ ఫ్రీ షార్ట్ టర్మ్ కోచింగ్ అందిస్తున్నారు. ఏప్రిల్ 1న ప్రారంభమైన ఈ కోచింగ్ మే 1తో ముగియనుంది.

విద్యార్థులకు వరం

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు వరంగా మారింది. ఈ ఏడాది నుంచి కేజీబీవీల్లో ఇంటర్ విద్య పూర్తి చేసిన వారికి అదే ఏడాది ఎప్‌సెట్‌కు నెల రోజుల పాటు షార్ట్ టర్మ్ కోచింగ్ ఇవ్వడంపై కేజీబీవీల విద్యార్థినులు ప్రైవేటు, ఆదర్శ గురుకుల జూనియర్ కళాశాలల పక్కన చేరనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని కేజీబీవీల్లో చదువుతున్న 154మంది విద్యార్థినులకు హసన్‌పర్తి కేజీబీవీలో ఏప్రిల్ 1 నుంచి ఎప్‌సెట్ కోచింగ్ క్యాంపు ప్రారంభమైంది. అన్ని వసతులతో కూడిన ఉచిత శిక్షణను ఇక్కడ నెల రోజుల పాటు అందించనున్నారు.

నిష్ణాతులైన అధ్యాపక బృందం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల్లో బోధిస్తున్న పీజీసీఆర్‌టీల్లో మెరికలైన వారిని ఎంపిక చేసి వారితో విద్యార్థినులకు కోచింగ్ ఇస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థినులకు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ తదితర విభాగాల్లో సీట్లు సాధించేందుకు తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతీ విద్యార్థినిపై దృష్టిపెట్టి కోచింగ్ సాగుతోంది. కోచింగ్‌తో పాటు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నారు. సబ్జెక్టుల్లో టాపిక్‌లు పూర్తి కాగానే అందులో విద్యార్థుల టెస్ట్‌లు నిర్వహిస్తూ పూర్తిగా కార్పొరేట్ స్థాయిలో కోచింగ్ నిర్వహిస్తున్నారు. ఈ కోచింగ్ సఫలీకృతమైతే కేజీబీవీ విద్యార్థులకు ఎప్‌సెట్‌లో ర్యాంకుల పంట పండనుంది.

జిల్లాల వారీగా విద్యార్థినులు సంఖ్య

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 154 మంది విద్యార్థినులను ఎంపిక చేసి కోచింగ్ ఇస్తున్నారు. వరంగల్ జిల్లాలో 10 కేజీబీవీల నుంచి 10 మంది విద్యార్థినులు, హనుమకొండలో 9 కేజీబీవీల నుంచి 90 మంది, జనగామలోని 12 కేజీబీవీల నుంచి 14 మంది, ములుగులోని 9 కేజీబీవీల నుంచి 12 మంది, జయశంకర్ భూపాలపల్లిలోని 10 కేజీబీవీల నుంచి 18 మంది విద్యార్థినులు మొత్తం 154 మంది విద్యార్థినులు ఈ కోచింగ్ సెంటర్‌లో ఎప్‌సెట్‌కు ప్రత్యేకమై శిక్షణ తీసుకుంటున్నారు.

విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ ఎండి. అబ్దుల్‌హై, హనుమకొండ డీఈవో



ప్రభుత్వం కేజీబీవీ విద్యార్థినుల కోసం మంచి కార్యక్రమం చేపట్టింది. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అధ్యాపకులు బోధిస్తున్న విషయాలను నేర్చుకొని అనుమానాలను నివృత్తి చేసుకోవాలి. ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా నెల రోజుల పాటు కష్టపడితే ఎప్‌సెట్‌లో మంచి ర్యాంకు సాధించి వారు కోరుకున్న కళాశాలలో సీటు సాధించే అవకాశం ఉంది. నిబద్ధతతో అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. నెల రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ షార్ట్ టర్మ్ ఎప్‌సెట్ కోచింగ్‌తో విద్యార్థినులు ర్యాంకులు సాధించే అవకాశం ఉంది.



ప్రణాళికాబద్ధంగా శిక్షణ సాగుతోంది..

సముద్రాల సునిత, జీసీడీవో, హనుమకొండ



ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఈవో ఆధ్వర్యంలో ఏప్రిల్ 1న హసన్‌పర్తిలోని కేజీబీవీలో కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించాం. నెల రోజులకు ప్రణాళికలను రూపొందించుకొని విద్యార్థినులకు కోచింగ్ ఇస్తున్నాం. నిరంతరం పర్యవేక్షిస్తూ, కోచింగ్ క్యాంపు ఎస్‌వో, అధ్యాపకులను సమన్వయం చేస్తూ కోచింగ్ నిర్వహిస్తున్నాం. పేద విద్యార్థినులకు ఎప్‌సెట్‌లో ర్యాంకులు సాధించే విధంగా ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టిన కోచింగ్ సెంటర్‌లో లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేస్తున్న నిష్ణాతులైన పీజీసీఆర్‌టీలు కార్పొరేట్ స్థాయిలో సబ్జెక్టులను బోధిస్తున్నారు. బోధన తరగతులతో పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. మే 1 తో శిక్షణ ముగుస్తుంది. ఈ కోచింగ్ సెంటర్ నుంచి చాలా మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధిస్తారని ఆశిస్తున్నాం.

ర్యాంక్ సాధిస్తా..

ఎన్. శైలజ, వెంకటాపూర్ కేజీబీవీ, ములుగు



షార్ట్ టర్మ్ కోచింగ్‌తో ఎప్‌సెట్‌లో మంచి ర్యాంకు సాధిస్తా. అధ్యాపకులు అద్భుతంగా బోధిస్తున్నారు. మంచి ఇంజనీరింగ్ కళాశాలలో సీటు సాధిస్తాను. కోచింగ్ సెంటర్‌లో వసతులు బాగానే ఉన్నాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదుకునేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా..

ఎం.బేబి, పాలకుర్తి కేజీబీవీ, జనగామ జిల్లా



కేజీబీవీల్లో ఈ ఏడాది ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన షార్ట్ టర్మ్ ఎప్‌సెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుంటాను. ఈ నెల రోజుల పాటు లెక్చరర్లు బోధిస్తున్న పాఠ్యాంశాలను శ్రద్ధగా చదువుతూ మంచి ర్యాంకు సాధిస్తాను. ఇక్కడి కోచింగ్ సెంటర్‌లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. లెక్చరర్లు అందరూ బాగా బోధిస్తున్నారు.

మే 1నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్15: తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో మే 1నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అధికారి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో శిక్షణ పొందేందుకు 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న బాల బాలికలు అర్హులని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంతో పాటు ఇతర క్రీడా మైదానాలలో పలు క్రీడాంశాలలో అనుభవజ్ఞులైన కోచ్‌ల ద్వారా నామమాత్రపు ఫీజు (పేఅండ్‌ప్లే) పద్ధతిన నెల పాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అదే విధంగా మండల, గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించనున్న క్రీడా శిక్షణ శిబిరాలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలో క్రీడా శిబిరాలను నిర్వహించేందుకు పీడీ, పీఈటీ లేదా సీనియర్ క్రీడాకారులు ఈ నెల 25వరకు హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం 9392997668 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వరంగల్ లోక్‌సభ ఎన్నిక ఓబీసీ ఇన్‌చార్జ్‌ల నియామకం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 15: వరంగల్ లోక్‌సభ ఎన్నికలో భాగంగా ఓబీసీ సెల్ నాయకులను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ప్రకటించారు. ఇన్‌చార్జిగా నియమితులైన వారిలో ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్ ముదిరాజ్, స్టేట్ కో-ఆర్డినేటర్ సందుపట్ల ధన్‌రాజ్, జాయింట్ కో-ఆర్డినేటర్లు బండారి జనార్దన్‌గౌడ్, పులి గణేశ్ ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలో పార్టీ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య గెలుపు కోసం వీరు బాధ్యతలను నిర్వహించనున్నారు.

నవజాత శిశువు మృతదేహం లభ్యం


చెరువులో లభ్యమైన శిశువు మృతదేహం

ఎల్కతుర్తి, ఏప్రిల్ 15: ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్ గ్రామ చెరువులో సోమవారం ఓ నవజాత మగ శిశువు శవం లభ్యమైంది. గ్రామ శివారులోగల చెరువులో నవజాత శిశువు శవం కనిపించడంతో గ్రామస్తులు భారీగా వెళ్లి చూశారు. దీంతో సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి తరలివెళ్లి పరిశీలించారు. శిశువు చేతులకు చికిత్సకు సంబంధించిన ప్లాస్టర్ వేసి ఉన్నాయి. దీంతో ఏవరో ఆస్పత్రి నుంచి తీసుకొచ్చి చెరువులో వేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. శిశువు ఎండతాకిడికి తట్టుకోలేక మృతి చెంది ఉంటుందని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు పలు కోణాలలో ఆరా తీస్తున్నారు.

ప్రజలను ఓటడిగే హక్కు కోల్పోయిన కేసీఆర్

తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ కూరపాటి వెంకట నారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

కాళోజీ జంక్షన్, ఏప్రిల్ 15: ప్రజలు నమ్మి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అధికారం కోల్పోయిన కేసీఆర్ ప్రస్తుతం బలమైన ప్రతిపక్షం ఉండాలని ప్రజలకు హితబోధ చేస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని తన స్వగృహంలో ఉద్యమకారులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను ఓటు అడిగే హక్కును కోల్పోయిన విషయాన్ని మర్చిపోతున్నాడని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఎవరూ ఓటు వేయవద్దని, ఆ పార్టీ అభ్యర్థిని కూడా గెలవకుండా చూడాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమకారులకు ఆయన పిలుపునిచ్చారు. దశాబ్దకాలంలో ప్రజల గొంతుకలైన ప్రతిపక్షాలను చీల్చి బ్లాక్‌మెయిల్ చేసి తాయిలాలు ఇచ్చి నాయకులకు దోపిడీ చేయడానికి అవకాశం కల్పించి ప్రజల భూములను, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి చరిత్ర సృష్టించారని ఆయన పేర్కొన్నారు.

కుమార్తె లిక్కర్ స్కాంలో జైలుపాలైందని, వారి కుటుంబానికి దగ్గరి బంధువులకు, అధికారులకు అందినంత దోపిడీ చేసుకోవడానికి అవకాశాలు ఇచ్చి విధ్వంసం సృష్టించారని ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి ప్రగతి భవన్ నుంచి గెంటివేశారని ఆయన ఎద్దేవా చేశారు. విద్యాసంస్థలను నిర్వీర్యం చేసి బహుజన వర్గాలను అణచివేసిన కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు రాజకీయంగా బొందపెట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టి ప్రజలను మోసంగించే మాటలు చెప్పి పార్టీని బతికించుకొని ఆస్తులను కాపాడుకోవడానికి కేసీఆర్ బస్సు యాత్రలు, రోడ్‌షోలు సిగ్గుపడకుండా కొనసాగిస్తున్నాడని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు సుమారు రూ.25వేల కోట్ల వడ్డీలు కట్టవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి మరో ఆరునెలల కాలం నుంచి పథకాలు అమలు చేయడానికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ క్లిష్టమైన సమయంలో ప్రజలు తమ ఓటును దోపిడీదారులకు వేయకుండా జాగ్రత్తపడా లని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఇంకా ఉద్యమకారులు డాక్టర్ కె. వీరస్వామి, చింతకింది కుమారస్వామి పాల్గొన్నారు.

వడ్డీ మాఫియా!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతంలో ఇద్దరు కార్పొరేటర్లు, మరో పది మంది చోటామోటా లీడర్లు ఈ ఫైనాన్స్ దందాలో ఉన్నారని, వీరికి రాజకీయ నేతల అండదండలతో పాటు పోలీసులు సహకారం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొందరు ఖాకీలు కూడా ఫైనాన్స్‌లో భాగస్వాములుగా ఉన్నారని, దీంతో అధిక వడ్డీల దందా మూడు పువ్వులు ఆరు కాయాలు చందంగా సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే జనగామ జిల్లాలో జనగామ, స్టేషన్‌ఘనపూర్, వరంగల్ జిల్లా నర్సంపేట, వర్ధన్నపేట, హనుమకొండ జిల్లా పరకాల, కమలాపూర్ ప్రాంతాల్లో భారీగా అక్రమ ఫైనాన్స్ దందా సాగుతోంది. అయితే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న గిరిగిరి దందాలో రాజకీయ నేతలతో పాటు కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు కూడా ప్రముఖంగా ఉన్నట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలవడంతో చాలా మంది రియల్టర్లు కూడా అధిక వడ్డీ వ్యాపారంలోకి అడుగు పెడుతున్నారు. లక్ష పెట్టుబడి పెడితే సంవత్సరం తిరుగక ముందే లక్ష రుపాయలు వడ్డీ వస్తుండటంతో కోట్లాది రుపాయలను వడ్డీ వ్యాపారంలో పెట్టి పేదలను జలగల్లా పీడిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ అధిక వడ్డీ వ్యాపారంపై పోలీసులకు ఫిర్యాదుల అందిన పట్టించుకోవటం లేదనే ఆరోపణలున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడే హడావిడి చేసి చేతులు దులుపుకోవటం మినహా పోలీసులు చేసేదేమీ ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సుధీర్‌కుమార్

కేటీఆర్‌ను కలిసిన సుధీర్‌కుమార్

రాంనగర్, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి తనకు అవకాశం ఇచ్చినందుకు సుధీర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూధనాచారి, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నేతలు వినయభాస్కర్, రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి తదితరులున్నారు.

మార్కెట్లో మరింత తగ్గిన మిర్చి ధరలు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 15: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మిర్చి ధరలు మరింత తగ్గాయి. ఈనెల 5న పలికిన ధరలకు సోమవారం పలికిన ధరకు చాలా తేడా ఉంది. వరుస సెలవుల రావడంతోపాటు రోజురోజుకూ ధరలు పతనమవుతుండడంతో రైతులు తమ దగ్గర ఉన్న మిర్చి పంటను వెంటనే అమ్ముకునేందుకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీంతో మార్కెట్‌కు మిర్చి బస్తాలు పోటెత్తుతున్నాయి. మిర్చి పెద్దఎత్తున రావడంతో ధరలు పడిపోతున్నాయని వ్యాపార వర్గాలు చెపుతున్నాయి.

మిర్చి ధర క్వింటాల్లో...

రకం	మార్చి 6న	ఏప్రిల్ 10న	ఏప్రిల్ 15న
తేజ రకం	రూ.20,300	రూ.19,000	రూ.18,300
వండర్‌హాట్	రూ.19,500	రూ.15,500	రూ.15,000
యుఎస్ 341	రూ.18,000	రూ.15,200	రూ.15,500
దేశీ	రూ.38,000	రూ.26,000	రూ.27,000
సింగిల్‌పట్టి	రూ.42,500	రూ.43,500	రూ.30,000
తాలు	రూ.8,500	రూ.7,000	రూ.7,000





గ్రామదేవతల వద్ద పండ్లు పంచుతున్న ప్రకాష్

మచ్చాపూర్‌లో బొడ్రాయి వార్షికోత్సవం

గీసుగొండ, ఏప్రిల్ 15: మండలంలోని మచ్చాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలైన శ్రీదేవి, భూదేవి సమేత నాభిశిల విగ్రహాలకు మహిళలు అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు దీపంమఠం రాజు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం పండ్లు, స్వీట్లను పంచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాష్, గ్రామ ప్రత్యేక అధికారి డాక్టర్ వడ్డేపల్లి రమేష్, ఎంపీవో ప్రభాకర్, కార్యదర్శి సునిత, గ్రామస్థులు నరిశెట్టి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



బొందివాగు నాలాను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

నాలాల్లో డీస్టింగ్ ప్రక్రియ చేపట్టండి

నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 15: నాలాల్లో డీస్టింట్ ప్రక్రియ చేపట్టి పనులు వేగవంతం చేయాలనివరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం నగర పరిధిలోని పద్మాక్షికాలనీ, న్యూశాయంపేట, బొందివాగునాలా, రైల్వేట్రాక్, మేదరి వాడ, కార్తీబార్, శాకరాసికుంట, జన్మభూమి జంక్షన్ ప్రాంతాల్లో నాలాల స్థితిగతులపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శాయంపేటలో స్మార్ట్‌సిటీ పనులను మధ్యలో నిలిపివేసిన కాంట్రాక్టర్‌ను పిలిచి పని పూర్తిచేయాలని ఆదేశించారు. బొందివాగు ప్రాంతంలో వర్షాకాలంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డీస్టింగ్ ప్రక్రియ ద్వారా నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా అధికారులు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంకా కీర్తి బార్ నుంచి గవిచర్ల రోడ్డు వరకు మూడు కిలో మీటర్ల మేర స్మార్ట్‌రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. జన్మభూమి జంక్షన్‌లో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని శానిటేషన్ అధికారులకు సూచించారు.

వర్షాకాలం ప్రారంభం అయ్యే వరకు డీసిల్టింగ్ పద్ధతి ద్వారా నాలాలు శుభ్రం చేసి నీరు ఎక్కడ కూడా నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంట ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ శ్రీనివాస్, డీఈలు రవికిరణ్, రంగారావు, శానిటరీ సూపర్‌వైజర్ మాదాసి సాంబయ్య, ఏఈలో సతీష్, హబీబ్, ముజామిల్, శానిటరి ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డిలు ఉన్నారు.

ముస్తాబైన రామాలయం



నేటి నుంచి శ్రీరామ నవమి వేడుకలు

వారం రోజుల పాటు ఉత్సవాలు

రంగశాయిపేటలోని పురాతన ఆలయంలో సందడి..

కరీమాబాద్, ఏప్రిల్ 15: అండర్ రైల్వేగేటు ప్రాంతం రంగశాయిపేటలోని ప్రాచీన సీతారామచంద్ర స్వామి దేవాలయం శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబైంది. 165ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో నిర్వాహకులు ఏటా శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. 165 ఏళ్లక్రితం స్థానికుడు దివంగత వద్దిరాజు మనోహర్‌రావు ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించగా, దివంగత పులిగిల్ల రామకృష్ణశాస్త్రి ఆలయ నిర్మాణం చేపట్టారు. 1859లో ప్రతిష్ఠాపనోత్సవాలు జరిగాయి. అప్పటి నుంచి కోరిన కోర్కెలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారంగా రామాలయం విరాజిల్లుతోంది. స్థల దాతలు, నిర్మాణకర్తల వంశస్థులు శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇక్కడ వారం రోజుల పాటు స్వామివారి కల్యాణ వేడుకల్ని బ్రహ్మోత్సవాలుగానిర్వహించడం ఆనవాయితీగా వస్తుండడం విశేషం.

ముస్తాబైన ఆలయం...

శ్రీరామ నవమి వేడుకలకు ఆలయం ముస్తాబైంది. రంగులు వేసి, సుందరీకరణ పనులు చేపట్టారు. ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం నిర్వహించే పూజలతోపాటుగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చనలు నిర్వహిస్తారు. ఉదయం, సాయంత్రం టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ మద్రారామాయణం ప్రవచన సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తారు. సంగీత సహితంగాన ఇర్వహించే ఈ ప్రవచన సప్తాహ కార్యక్రమంలో గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ వెలిదె నర్సింహమూర్తి శర్మ, ప్రభాకర శాస్త్రి, భార్గవ శర్మ, ప్రదీప్ శాస్త్రిలు పాల్గొంటారు.

అలాగే వారం రోజుల పాటు నిర్వహించే స్వామి వారికి హంససేవ, అశ్వసేవ, గరుడసేవ, హనుమత్ సేవ, శేష సేవలు నిర్వహించనున్నారు. అలాగే చిన్న రథంతో, పెద్ద రథంతో పరివారంతో ఊరేగింపు ప్రత్యేక ఆకర్శణగా నిలుస్తోంది.





ఉత్సవాలు ఇలా..

- 16న విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అంకురారోపణాధి అగ్ని ప్రతిష్ఠాపన పూజ
- 17న ఉదయం ధ్వజారోహణ, భేరిపూజ, ఎదుర్కోళ్లు, సేవా, వద్దిరాజు రంగారావు ఇంటి ముందు జరుగుతుంది. ఆలయ కల్యాణ మండపంలో కల్యాణ వేడుక తలంబ్రాలు నిర్వహిస్తారు.
- 18న రాత్రి హనుమత్‌సేవ, స్వామి వారు పుర వీధుల్లో ఊరేగింపు.
- 19న ఉదయం బ్రాహ్మణ, సభా సత్కారం, రాత్రి చిన్న రథంపై గరుడ వాహనంపై స్వామివారు ఊరేగింపు.
- 20న ఉదయం హంస వాహనసేవపై గ్రామ బలిహరణం, రాత్రి శేషసేవపై ఊరేగింపు
- 21న ఉదయం అలుకకు స్వామివారు వ్యవస్థాపక ధర్మకర్త పులిగిళ్ల వెంకటరామనరసింహ శాస్త్రి, రామకృష్ణ శాస్త్రి నివాసానికి రావడం, సాయంత్రం పారువేట సేవ, బండ్లు తిరుగుట (జాతర), రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు రథబలి, పెద్ద రథంపై స్వామి వారి ఊరేగింపు.
- 22న ఉదయం తిరుమంగళ్ ఆళ్వార్‌సేవ, మధ్యాహ్నం కుంభహారతి రాత్రి నాగబలి, పుష్పయాగం 12 సేవలు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

అదనపు కలెక్టర్ సంధ్యారాణి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 15: ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఇందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాల పాత్ర ఎంతో కీలకమైందని జిల్లా ఉప ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీడియో సర్వేలెన్స్ టీమ్, ఎన్నికల విధి విధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ ఎన్నికల ఖర్చుల వివరాలు, షాడో రిజిస్టర్ ఎప్పటికప్పుడు ఖర్చుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించడంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్స్ సర్వేలెన్స్ బృందాలు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. సి విజిల్ యాప్‌ను ప్రతీ ఒక్కరూ తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సి విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి పద్మలత, జిల్లా నోడల్ అధికారులు రాంరెడ్డి, సంజీవరెడ్డి, పుష్పలత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

23న శ్రీగోవిందరాజస్వామి రథోత్సవం



గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

గిర్మాజీపేట, ఏప్రిల్ 15: నగరంలోని చారిత్రక ప్రసిద్ధిగాంచిన గోవిందరాజుల గుట్టపై స్వయంభూగా వెలసిన శ్రీదేవినీళాదేవిభూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రథోత్సవం 23న కన్నుల పండువగా నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి, దేవాలయ కార్యనిర్వహణాధికారి వై.రత్నాకర్ రెడ్డిలు తెలిపారు. సోమవారం ఆలయ మెట్ల మార్గంలో బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను వారు కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్‌లతో కలిసి తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేందర్‌శర్మ ఆవిష్కరించారు. అనంతరం ఉపేంద్రశర్మ మాట్లాడుతూ దశాబ్దాలుగా శ్రీగోవింద రాజస్వామి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయన్నారు. శనివారం నుంచి లాంఛనంగా ప్రారంభమైన శ్రీగోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 30 వరకు జరుగుతాయని తెలిపారు.

అర్చకులు శ్రీనివాసస్వామి మాట్లాడుతూ 17న శ్రీగోవిందరాజస్వామి తిరు కల్యాణోత్సవం, 22న గుట్ట చుట్టు బండ్లు తిరుగుతాయన్నారు. బ్రహ్మోత్సవాల ప్రధాన ఘట్టమైన స్వామి రథోత్సవం 23న సాయంత్రం గుట్ట నుంచి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సోమరాతి సత్యనారాయణ, ఆలయ అర్చకులు లక్ష్మణస్వామి, క్రాంతికుమార్ స్వామి, అరుణ్‌స్వామి, కృష్ణమూర్తి స్వామి, మురళి స్వామి, గోవిందస్వామి, ఆలయ అభివృద్ధికమిటీ నాయకులు చింతాకుల సునీల్‌కుమార్, యిప్ప ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బల్దియాకు ప్రత్యేక అధికారుల నియామకం

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 15: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమలవుతున్న పలు పథకాలను పర్యవేక్షించేందుకు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు పలువురు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపిక చేయబడిన ఆరుగురు అధికారులు బల్దియా పరిధిలోని వేసవిలో తాగునీటి సరఫరా, అమ్మ ఆదర్శ పాఠశాల నిర్వాహణ, వేసవిలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ పలు డివిజన్‌లను కేటాయించారు. ప్రస్తుతం బల్దియాకు కేటాయించిన ప్రత్యేక అధికారులు జిల్లాలోని పలు కార్యాలయాల్లో ఉన్నతాధికారులగా పని చేస్తున్నారు. వీరికి ప్రత్యేక హోదా కల్పిస్తూ బల్దియాకు నియమించారు.

డివిజన్ల వారీగా అధికారులు..

జిల్లా మత్స్యశాఖ అధికారి విద్యాభారతికి(సెల్.94408 14749) 1, 2,4, 5,6, 54 డివిజన్లు కేటాయించారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి ఎం.మల్లయ్య (799797 3323)కు7,8,9,10, 30,31 డివిజన్లు, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎం.శ్రీను (79933 57105)కు 44,45,46, 47,63,64 డివిజన్లు, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డు ఎల్.ప్రభాకర్(96030 54279)కు 48,49,50,51, 52 డివిజన్లు కేటాయించారు. అలాగే లీగల్ మెట్రాలజీ అధికారి ప్రవీణ్ కుమార్ (63049 82375)కు 53, 55, 56,65, 66 డివిజ న్లు, ఇంటర్మీడియట్ అధికారి గోపాల్‌కు (98668 74129) 57, 58, 59, 60, 61, 62డివిజన్లు కేటాయిస్తే ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఏప్రిల్15: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా కేయూ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యారణ్యపురి, పలువేల్పుల, సీఆర్‌పీఎఫ్ క్యాంపు, కేయూ రాణా ఏరియాలో ఉదయం 9నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ . సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాద్రినగర్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 11 విద్యుత్ సరఫరా జరగదన్నారు. అలాగే వరంగల్‌లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగించే చెట్ల కొమ్మల తొలిగింపులో భాగంగా ఉదయం 8 గంటల నుంచి 11.30 వరకు శంభునిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని రంగశాయిపేట, తెలంగాణ కాలనీ, సాయినగర్, రామాలయ కాలనీ, నాగమయ్య ఏరియా, ఖిలావరంగల్ పెట్రోల్ పంపు, అన్నపూర్ణ కాంప్లెక్స్, సాయిబాబా టెంపుల్, పద్మశాలీ స్ట్రీట్, విశ్వనాధ కాలనీ, మైమాస్టర్ స్కూల్, గిరిప్రసాద్ కాలనీ, టీచర్స్ కాలనీ, గణేశ్‌నగర్ కాలనీ ఏరియాలో విద్యుత్ సరఫరా జరగదని వరంగల్ డీఈ మల్లిఖార్జున్ తెలిపారు. అలాగే ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఖిలా వరంగల్ మధ్య కోటలో విద్యుత్ సరఫరా జరగదన్నారు.

రేవూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో కలిసిన వారితో ఎమ్మెల్యే రేవూరి

సంగెం, ఏప్రిల్ 15: షాపురం, లోహిత గ్రామాల నుంచి పలువురు హనుమకొండలోని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నివాసంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. లోహిత ఎంపీటీసీ లడ్డగట్టు దుర్గారావు, షాపురం మాజీ సర్పంచ్ పేరాల రాజు, కాపులకనుపర్తి సొసైటీ డైరెక్టర్ పి.రాజు, వార్డు సభ్యులు బొడిగె రజిత సదయ్య, పేరాల రాజయ్య, సంపత్, బీఆర్ఎస్ ఎస్సీఎల్ మండల అధ్యక్షుడు ఓరుగంటి రాజు, గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు రైడాల రాజు, మచ్చ యాదగిరి, షాపురం బీఆర్ఎస్ అధ్యక్షుడు పేరాల దిలీప్‌రావులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంగెం మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు అచ్చ నాగరాజు, జిల్లా నాయకులు గుమ్మడి హరి బాబు, అంజన్‌రావు, మండల నాయకులు మునికుంట్ల మోహన్, షాపురం నాయకులు దొనికెల శ్రీను, శ్రీహరి, సమ్మారావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

సంగెం, ఏప్రిల్15: గవిచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం అధికారులు పరిశీలించారు. వడ్ల కొనుగోలుకు కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తూకం మిషన్లు, సరిపడా టార్పాలిన్లు, వడదెబ్బ తగలకుండా టెంటు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, తాగునీరు, ఓఆర్ఎస్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం జడ్పీఎస్ఎస్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చేపట్టిన పనులను తనిఖీ చేశారు. కుంటపల్లి, సంగెం గ్రామాలను సందర్శించి చెరువు పూడికతీత పనులను పరిశీలిం చారు. కార్యక్రమంలో సంగెం ఎంపీడీవో రవీందర్, ఎంపీవో కొమురయ్య, ఏపీఎం కిషన్, ఈసీ గణేష్, కార్యదర్శి రవీందర్, సీసీ స్వరూపరాణి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

వరంగల్ సిటీ, ఏప్రిల్ 15: కాశిబుగ్గ జంక్షన్‌లో సోమవారం లక్ష్మిపతి పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత తొమ్మిదేళ్లుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. చల్లటి మినరల్ వాటర్, మజ్జిగను అందించేందుకు దాతలు రమానాథం రఘు, కిషోర్, ప్రవీణ దంపతుల సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం పరపతి సంఘం దివంగత మాజీ అధ్యక్షుడు వంగరి ప్రవీణ్ భార్య కళ్యాణి ప్రవీణ్ జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వేముల నాగరాజు, దాసి శివకృష్ణ, దుస్స కృష్ణ, మామిడాల సతీష్‌శ్రీకాంత్, చంద్రశేఖర్, క్యాతం శ్రీనివాస్, వంగరి రవి, జగన్, నాగరాజు, లక్ష్మణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మద్యం బాటిళ్ల స్వాధీనం

చెన్నారావుపేట, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని బెల్టు షాపులపై నిర్వహించిన దాడుల్లో రూ. 30 వేల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న బెల్ట్ షాపులల్లో దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. అలాగే బెల్ట్ షాపుల యాజమానులు బూర రమేశ్, పర్ష నర్సయ్య, వనపర్తి చేరాలు, వేముల సదానందంపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'వామపక్ష శక్తులు ఏకం కావాలి'



వామపక్షాల జిల్లా సదస్సులో నాయకుల అభివాదం

గిర్మాజీపేట, ఏప్రిల్ 15: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, రాజ్యాంగాన్ని పరిరక్షించడం ద్వారా దేశాన్ని కాపాడుకునేందుకు కమ్యూనిస్టు వామపక్ష శక్తులు ఐక్యంకావాలని కమ్యూనిస్టు, వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని అండర్ బ్రిడ్జి సమీపంలోని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యాలయం ఓంకార్ భవన్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలు- మతోన్మాదానికి వ్యతిరేకంగా జిల్లా సదస్సు జరిగింది. ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్నలు మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలతో దేశంలో ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసిందని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగానికి అప్పగించడంతో దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందన్నారు. కమ్యూనిస్టు, వామపక్ష పార్టీలు ఏకం కావటం ద్వారా ప్రజలను క్షేత్రస్థాయిలో చైతన్యపరిచి మోదీ నుంచి దేశాన్ని రక్షించుకుందామని కమ్యూనిస్టు, వామపక్ష నాయకులు కోరారు. ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సీపీఎం జిల్లా నాయకుడు ఎస్.బాబు, న్యూడెమోక్రసీ, మాస్‌లైన్, ఆర్ఎస్పీ, సీపీఐ(ఎంఎల్) నాయకులు జి.దయాకర్, వి.కుమార్, సూరి, ఈర్ల పైడి అధ్యక్షవర్గంగా జరిగిన ఈ సదస్సులో కమ్యూనిస్టు, వామపక్షాలు, అనుబంధ ప్రజాసం ఘాల నాయకులు జి.కుమారస్వామి, కె.బాబురావు, ఆర్.బాల రాజు, ఎం.రవి,ఈ.బాబు, కె.శివాజీ, ఎస్.భాస్కర్, సావిత్రి, ఎన్.రత్నమాల, సంధ్య, అప్పారావు, బండి కోటేశ్వర్, బషీర్, కుమారస్వామి, కొమురయ్య, వెంకన్న, దర్గయ్య, గోవర్ధన్, పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 16 ఏప్రిల్ 2024
వరంగల్ రూరల్
• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

ఇల్లందలో శ్రీరామ నవరాత్రి స్వర్ణోత్సవాలు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 15 : మండలంలోని ఇల్లందలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని నవరాత్రి స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా పలువురిని సన్మానించారు. అనంతరం సమితి అధ్యక్షుడు అడప రాజు, ప్రధాన కార్యదర్శి మోడెం కుమారస్వామిలు మాట్లాడుతూ ఈనెల 13 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 17 వరకు జరుగుతాయని తెలిపారు.

ఇందులో భాగంగా పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని, పాతాల భైరవి, భక్త ప్రహ్లాద, మాయాబజార్, లవకుశ లాంటి పౌరాణిక ప్రదర్శలు ప్రజలను ఎంతో అలరిస్తాయని తెలిపారు. చివరి రోజు కళాకారులను, ప్రజాప్రతినిధులను, ఉత్సవ కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించనున్నట్లు స్పష్టం చేశారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



పర్వతగిరి పీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న వెంకటరమణ

పర్వతగిరి, ఏప్రిల్ 15: వడదెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలంలో ప్రజలందరూ వడదెబ్బ తగలకుండా చర్యలు తీసుకోవాలని, ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, ఉపకేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా మందులు అందుబాటులో ఉంచుతున్నామని, అవసరం ఉన్నవారు వాటిని వినియోగించుకోవాలన్నారు. వడదెబ్బ నివారణకు జిల్లావ్యాప్తంగా 14 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఏడు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, రెండు సామాజిక ఆరోగ్యకేంద్రాలు, 118 ఆరోగ్య ఉపకేంద్రాలలో రెస్పాండ్ టీమ్‌లను ఏర్పాటుచేశామన్నారు. మండలస్థాయిలో వైద్యాధికారితో పాటు తహసీల్దార్, ఎస్సై, రెవెన్యూడివిజన్‌లో అడిషనల్ డీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు ప్రజలకు అవగాహన కల్పిస్తారని అన్నారు. వేసవిలో గర్భిణీలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవించేలా సిబ్బంది చొరవ తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో అబార్షన్‌లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి, సిబ్బంది వనజ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యమూ ముఖ్యమే



పెద్దకొర్పోలులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నెక్కొండ, ఏప్రిల్ 15 : విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ప్రకాశ్ అన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక గురుకుల పాఠశాలల్లో సోమవారం రాష్ట్రీయ బాల స్వస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉన్న విద్యార్థులు ఉన్నత విద్యల్లో రాణిస్తారన్నారు. విద్యార్థులు ఎక్కువగా పాలు, ఆకుకూరలు, పండ్లు, కూరగాయల వంటి పౌష్టికాహారం తీసుకుంటే తరచుగా అనారోగ్యానికి గురికాకుండా ఉండటంతో పాటు కంటి జబ్బులను నివారించవచ్చన్నారు. పరిశుభ్రతను పాటించిన విద్యార్థులు జబ్బులకు దూరంగా ఉంటారన్నారు. 129 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించగా ఏడుగురు విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ సుధా, డాక్టర్ రామ్ చరణ్, గురుకులం ప్రత్యేకాధికారి రజిత, వైద్య సిబ్బంది కరుణ, జూలేఖ, స్మిత, సమ్మక్క, జ్యోతి పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



రాయపర్తిలో పరీక్ష సరళిని పరిశీలిస్తున్న కృష్ణమూర్తి

రాయపర్తి, ఏప్రిల్ 15 : ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాల పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మెటివ్- 2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా పరీక్షల బోర్డు ప్రధాన కార్యదర్శి, డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1-9 తరగతి వరకు విద్యార్థులు రాస్తున్న పరీక్షల తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకున్న తరువాతనే జవాబులు రాయాలన్నారు. ప్రతీ విద్యార్థికి పరీక్షలపై అవగాహన ఉండాలన్నారు. ఈనెల 23తో పాఠశాలల పనిదినాలు ముగుస్తుండడంతో ఆలోపే విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందే విధంగా ఉపాధ్యాయులు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు సునిత, శర్మ, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారిణి ఉషాదయాల్



మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న జేడీఏ ఉషాదయాల్

నర్సంపేట, ఏప్రిల్ 15 : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి(జేడీఏ) ఉషాదయాల్ అన్నారు. నర్సంపేటలోని వ్యవసాయమార్కెట్ యార్డులో సోమవారం విఘ్నేశ్వర ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్లాల్లో రైతులు ధాన్యం ఆరబెట్టుకుని తేమశాతం 17 మించకుండా చూసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని సూచించారు. ప్యాడీక్లీనర్ ద్వారా ధాన్యంలో చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేసుకుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకు వచ్చి ఏ గ్రేడ్ కు 2203, సాధారణ రకం 2183 మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువ ధరతో కొనుగోలు చేస్తే లైసెన్సు రద్దు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద టెంటు ఏర్పాటు చేయాలని, 30 టార్పాలిన్లను అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులకు ఓఆర్‌ఎస్ పాకెట్లు అందించాలని జేడీఏ ఆదేశించారు.

అధికారులకు సంబంధించిన టోల్ ఫ్రీ నంబర్లతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్య క్రమంలో ఎఫ్‌పీఓ అధ్యక్షుడు చిలువేరు కుమారస్వామి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి తక్కళ్ళపల్లి రవీందర్‌రావు, ఓబీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సుతిరుపతి, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, మాజీ వైఎస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, కౌన్సిలర్ ఎలకంటి విజయ్, దండెం రథన్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో చోరీ..

చెన్నారావుపేట, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన సోమవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మండల మల్లికాంబ భర్త మల్లేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, మల్లికాంబ ఇంటికి తాళం వేసి గ్రామంలోనే మరో ఇంట్లో కిరాయికి ఉంటోంది. ఆమె ఇంట్లో ఎవరూ ఉండటం లేదని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఇంటి తాళాన్ని పగలగొట్టి బీరువాలో ఉన్న అరతులం బంగారం, 10 తులాల వెండి గాజులు, 50 కిలోల బియ్యాన్ని అపహరించారు. చోరీ విషయమై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయటంతో సంఘటన ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న పంట

ఖానాపురం, ఏప్రిల్ 15: మండలంలోని ధర్మరావుపేటలో విద్యుదాఘాతంతో సోమవారం మొక్కజొన్న పంట దగ్ధమైంది. బాధిత రైతు బానోత్ బాలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో మూడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పొలంలో ఉన్న విద్యుత్ తీగలు రాపిడి జరిగి మంటలు లేచి పొలంలో పడటంతో చేను దగ్ధమైంది. స్థానికుల సహాయంతో మంటలను అదుపులోకి తీసువచ్చారు. సుమారు రూ.3లక్షల విలువైన పంటకు నష్టంవాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు.

వన నర్సరీ నెట్ అపహరణ

చెన్నారావుపేట, ఏప్రిల్ 15: మండలంలోని పత్తినాయక్‌తండాలో వన నర్సరీ పెంపకం కోసం వేసిన షెడ్ నెట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరణ చేశారని పంచాయితీ కార్యదర్శి నిట్ సోమవారం తెలిపారు. నర్సరీలో వేసిన షేడ్ నెట్‌ను అపహరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయటం జరిగిందని తెలిపారు.

అంబేద్కర్‌ను అవమానించిన సీఎం రేవంత్‌రెడ్డి



లక్ష్మీపురంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

నెక్కొండ, ఏప్రిల్ 15: భారత రాజ్యాంగ నిర్మాత సమసమాజ సమానత్వాన్ని కోరుకున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవమానించారని ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ఈదునూరి యాకయ్య ఆరోపించారు. సోమవారం నెక్కొండలోని అంబేద్కర్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన విగ్రహానికి సీఎం పూలమాల వేయకపోవడం ఆయన అభిమానులనే కాకుండా రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవ పదమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి ఇలాంటి చర్యలకు పాల్పడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌టీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మైసి శోభన్, మండల అధ్యక్షుడు తడుగుల జనార్దన్, నాయకులు కందిక రాజు, గారే శ్యాంప్రసాద్, పొలిశెట్టి దేవస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

దుగ్గొండి: అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని సచివాలయం ఆవరణలోని అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని అలంకరించకుండా, నిర్లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరించారని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని లక్ష్మీపురం అంబేద్కర్ విగ్రహం వద్ద పూలు పట్టుకుని నిరసన తెలిపారు. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, నియోజన వర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, గుండెకారి రంగారావు, ఎంపీటీసీ మామునూరి సుమన్, నాగనబోయిన తిరుపతి, పిండి రాజు, బాబురావు, పురుషోత్తం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల రిజర్వేషన్ సమస్యలను పరిష్కరించాలి

మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులిదేవేందర్



నియామక పత్రాలను అందజేస్తున్న పులి దేవేందర్

నర్సంపేట, ఏప్రిల్ 15 : ముదిరాజ్‌ల రిజర్వేషన్లను పరిష్కరించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులిదేవేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్ ఎఫ్‌సీ హోటల్‌లో ఆదివారం రాత్రి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ అధ్యక్షతన డివిజన్ కమిటీ ఎన్నిక కోసం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అత్యధిక జనాభాకలిగిన ముదిరాజ్‌లకు విద్యా, ఉద్యోగ, ఉపాధి తదితర రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అనంతరం డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. మెపా డివిజన్ అధ్యక్షుడిగా పెండ్యాల యాదగిరి, ప్రధానకార్యదర్శిగా పెండ్యాల మధు, గౌరవ అధ్యక్షుడిగా పిట్టల కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా దోని చేరాలు, దండుశ్రీను, హంస వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులుగా సింగారపు భాస్కర్, ఎలబోయిన రాజు, చెలకపల్లి యాకయ్య, కార్యవర్గ సభ్యులుగా దండుకరుణాకర్, మొద్దువేణు, గిన్నెరాజు, నిమ్మనబోయిన రమేశ్, గౌరబోయిన నిరంజన్ ఎన్నికయ్యారు. గుంటుక రమేశ్, దొంతరబోయిన నగేశ్, ఓరంగంటి తిరుపతి, ఎలబోయిన రాజు, కొప్పు అశోక్, రమేశ్, నరేశ్, నర్సింగం, దండు రమేశ్, నవీన్, రాజేశ్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

ఖానాపురం, ఏప్రిల్ 15: కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం అన్నారు. సోమవారం కొత్తూరులోని కిసాన్ రైస్‌మిల్లు, రాగంపేటలోని విజయలక్ష్మి రైస్ మిల్లుకు చెందిన హమాలీ కార్మికులతో సమావేశం నిర్వహించి కార్మిక సమస్యలపై చర్చించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం బహుళజాతి కంపెనీలకు దాసోహం అయ్యి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44రకాల కార్మిక చట్టాలను 4 కోడులుగా మార్చి కార్మికుల హక్కులను హరించి వేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తుందన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హమాలీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు లింగన్న, ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, మురళి, సత్యం, కృష్ణ, ఐలయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా సీతారాంనాయక్‌ను గెలిపించాలి

నర్సంపేట, ఏ ప్రిల్ 15 : మహబూబాబాద్ పార్లమెంట్ నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అజ్మీర సీతారాంనాయక్‌ను, మరోసారి ప్రధానిగా నరేంద్రమోదీని గెలిపించాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, జిల్లా ప్రధానకార్యదర్శి రేసుశ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 4,5 వార్డుల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను పొందిన లబ్దిదారులను కలిసి కరపత్రాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో సోషల్‌మీడియా కన్వీనర్లు కొమాండ్ల సప్తగిరి, సామల ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు బోడ గోల్యానాయక్, జుర్రురాజు, నాయకులు వీరన్న, నూనె రంజిత్, పట్టణ ప్రధాననకార్యదర్శులు కొంపెల్లి రాజు, గూడూరు సందీప్, ఠాకూర్ రవీందర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటం చేస్తాం..

ఖానాపురం, ఏప్రిల్ 15: ప్రతిపక్ష పార్టీ హోదాలో నిత్యం ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేస్తుంటే అవగాహన లేమితో ఉన్న స్థానిక కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. అవినీతి అక్రమాలను నిరూపించడానికి బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ నాయకులకు వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, రామసహాయం ఉపేందర్‌రెడ్డి, ఒల్లెపు శ్రీను, కోఆప్షన్ సభ్యుడు మస్తాన్, మౌలాన పాల్గొన్నారు.

'రామగోని'కి నాయకుల నివాళి

నర్సంపేట, ఏప్రిల్ 15 : నర్సంపేట పట్టణానికి చెందిన తొలి ఉద్యమకారుడు, సర్వోదయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామగోని వెంకటేశ్వర్లుగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మోకుదెబ్బనాయకులు సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుని కుమారులు రాజేశ్‌గౌడ్, రాజ్‌కుమార్‌గౌడ్‌లను పరామర్శించారు. కార్యక్రమంలో మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకటేశ్వర్లు, రాష్ట్రనాయకులు రామగోని సుధాకర్, మద్దెల సాంబయ్య, జిల్లా కార్యదర్శి కొండి రాము తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

పర్వతగిరి, ఏప్రిల్ 15: మండలకేంద్రంలో కంఠమహేశ్వరస్వామి, సురమాంబ, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ప్రార ంభమయ్యాయి. తొమ్మిదిరోజుల పాటు చేపట్టనున్న వేడుకల్లో మొదటిరోజు పలువురు గౌడకులస్థులు శివమాలధారణ చేశారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేకపూజలు నిర్వహించి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తీగల వీరస్వామిగౌడ్ తెలిపారు. ఈకార్యక్రమంలో పుల్లూరి సారయ్య, రంగు జనార్ధన్, రంగు కుమారస్వామి, దొనికెన దయాకర్, చీకటి యాకన్న, జనగాం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ పై మాక్ డ్రిల్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 15 : వర్ధన్నపేటలోని బస్టాండ్ ప్రాంగణంలో సోమవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీపై మాక్ డ్రిల్ నిర్వహించారు. వివిధ వాణిజ్య, వ్యాపార సముదాయాల్లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి భద్రయ్య మాట్లాడుతూ అధికారుల సూచనలు పాటించాలని, వ్యాపారులు, నివాస గృహాల ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని కరపత్రాలు పంపిణీ చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్



అఖిల్‌కు చికిత్స అందిస్తున్న వైద్యులు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 15 : ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టిన ఘటనలో యువకుడికి గాయాలైన సంఘటన పట్టణంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వర్ధన్నపేట ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీని డ్రైవర్ వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు సమీపంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పక్కన నిలిపాడు. ఈ క్రమంలో రాయపర్తి నుంచి వర్ధన్నపేట వైపు వస్తున్న మూడు అఖిల్ నాయక్ ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో స్థానికులు వెంటనే వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ ఆసుత్రికి చేరుకుని అఖిల్ నెక్కొండ మండలం చంద్రుగొండ గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

చెన్నారావుపేట, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని బెల్టు షాపులపై నిర్వహించిన దాడుల్లో రూ. 30 వేల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న బెల్ట్ షాపులల్లో దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. అలాగే బెల్ట్ షాపుల యాజమానులు బూర రమేశ్, పర్ష నర్సయ్య, వనపర్తి చేరాలు, వేముల సదానందంపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం

దుగ్గొండి, ఏప్రిల్15: మండలంలోని మైసంపల్లికి చెందిన ఈద సుందరికి ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్లలో 1986-1987లో పదోవ తరగతి చదివిన స్నేహితులతో ఏర్పడిన పరపతి సంఘం నుంచి రూ.1,00,000 ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. సుందరికి చెందిన రేకుల ఇల్లు గాలి దూమారంతో రెండేళ్ల కిందట కూలిపోయింది. దీంతో ఆమె ఇల్లు నిర్మాణం కోసం ఇబ్బందిపడుతుండగా ఆమెతో పదో తరగతి చదివిన స్నేహితులు పరపతి సంఘం నుంచి సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పరపతి సంఘం అధ్యక్షుడు చెలకాని అంజయ్య, ప్రధాన కార్యదర్శి మన్నె బాబు కోశాధికారి పులిచేరు సదానందం, సభ్యులు పిల్లారిశెట్టి లక్ష్మీ, సూరం నారాయణరెడ్డి, జెండా పుష్పా, దుండె రాజకళ, మహేందర్, చిలువేరు రమ, లీలమణి, శోభారాణి పాల్గొన్నారు.